క్లుప్తంగా

కొండలమ్మ ఆలయంలో భక్తుల కోలాహలం



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

100 మందికి వైద్య పరీక్షలు

పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెం హజరత్ ఇమామ్ హాస్పిటల్‌లో గదీర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పామర్రుకు చెందిన డాక్టర్ శివయ్య రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. 100 మంది రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని డాక్టర్ ఫణి, అంజాద్ అలీ, షిఫాయత్ అలీ, హుస్సేన్ అలీ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



మండవల్లి: స్థానిక శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద స్థానిక మురళీ బాలకృష్ణ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రుల పూజా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువులు వీరాస్వామి, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలు, బాలలు కీర్తనలకు అనుగుణంగా కోలాట ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు బ్రహ్మర్షి సీహెచ్ శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

దమ్ము చక్రాలతో దెబ్బతింటున్న రహదారులు



తోట్లవల్లూరు: దమ్ము చక్రాలతో రహదారులు దెబ్బతింటున్నాయి. ఖరీఫ్ పనులు ఊపందుకోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపై ట్రాక్టర్లు దమ్ముచక్రాలతో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. అసలే అధ్వానపు రోడ్లతో అవస్థలు పడుతున్న ప్రజలకు దమ్ముచక్రాల ట్రాక్టర్లు మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. తారురోడ్లు, అంతర్గత రోడ్లపై ట్రాక్టర్లు దమ్ముచక్రాలతో సంచరిస్తుండటంతో ఆయా రోడ్లు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆర్అండ్‌బీ రహదారులు స్పందించి ప్రధాన రహదారులపై దమ్ముచక్రాల ట్రాక్టర్ల రాకపోకలను నియంత్రించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన రోడ్లను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మేయర్ వెంకటేశ్వరమ్మకు పరామర్శ



కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన మచిలీపట్నం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ తండ్రి యార్లగడ్డ లక్ష్మయ్య పెద్దకర్మ కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని), పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు కైలే అనిల్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మండ శ్రీనివాసరెడ్డి, పేకేటి సీతారామిరెడ్డి, వేల్పూరి వెంకయ్య, ఇంటూరి అభిషేక్, జ్యోగి సాంబరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 8 మంది గైర్హాజరు

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో డీఎస్సీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం సెషన్‌లో పరీక్ష లేదన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 180 మందికి గాను 172 మంది హాజరయ్యారని, ఎనిమిది మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని వారు పేర్కొన్నారు.

వీరంకిలో సమస్యల మోత

- వెలగని వీధిలైట్లు
- మురుగుతో అవస్థలు
- అధ్వానంగా ప్రధాన రహదారి
- అభివృద్ధి చేయాలని గ్రామస్తుల వినతి



కమ్మిలవారిపాలెంలో ఇళ్ల మధ్య మురుగునీరు



అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

పమిడిముక్కల: వీరంకి గ్రామం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. వెలగని వీధి లైట్లు, కదలని మురుగు, అధ్వానంగా ఉన్న రహదారులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీరంకి లాకు నుంచి వీరంకి, అమీనపురం, ఫత్తేలంక వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలు పడి, రాళ్లు లేచి ప్రమాదకరంగా ఉంది. గ్రామంలోని వీధిలైట్లు ఏవీ వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. వీరంకి శివారు గ్రామమైన కమ్మిలవారిపాలెంలో సైతం వీధిలైట్లు వెలగడం లేదు. డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగునీరు ఇళ్ల మధ్యే నిలిచి ఉంది.

దోమల వ్యాప్తి..

దోమలు వ్యాప్తి చెందుతున్నాయని కమ్మిలవారిపాలెం వాసులు ఆందోళన చెందుతున్నారు. దీంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామని వాపోతున్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని చెబుతున్నారు. వీధిలైట్లు వెలగక రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. మోటార్ పాడైపోవడంతో వాటర్ ట్యాంక్‌కు నీరు ఎక్కడం లేదని, తాగునీరందక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. వీధిలైట్లు, వాటర్, మురుగు సమస్యలను కార్యదర్శి దృష్టికి పలుసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కార్యదర్శిని ఏపని అడిగినా సర్పంచ్ సహకరించడం లేదని చెప్పి తప్పించుకొంటున్నారని, పంచాయతీలో పాలన పడకేసిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వీరంకి సచివాలయం

వీధి లైట్లు వెలగటం లేదు



గ్రామంలో కొద్ది రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వీరంకి వచ్చి ఇక్కడి సమస్యలు పరిష్కరించాలి.

– అబ్దుల్ రహమాన్, గ్రామస్తుడు

అధ్వానంగా ప్రధాన రహదారి



మూడు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే వీరంకి రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి.

– భట్టిప్రోలు శ్రీనివాసరావు, గ్రామస్తుడు

కార్యదర్శి సహకరించడం లేదు

పంచాయతీ కార్యదర్శి గ్రామాభివృద్ధికి సహకరించడం లేదు. గ్రామంలో తాగునీరు, రహదారులు, వీధి లైట్లు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించాం.

– కాసాని నాగేశ్వరమ్మ, సర్పంచ్

జగనన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం



అమీనపురంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



వీరంకిలో పోతురాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: వైఎస్సార్ సీపీ అధినేత జగనన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దామని, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను జయప్రదం చేద్దామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని అమీనపురం, వీరంకి గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. అమీనపురంలో పార్టీ నాయకులు కరిమికొండ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. వీరంకిలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, సర్పంచ్ కాసాని నాగేశ్వరమ్మ, మరీదు పోతురాజులను పరామర్శించారు. ఈ సందర్భంగా తనను కలిసిన వీరంకి, అమీనపురం, ఫత్తేలంక గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలను యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు అవినీతిమయంగా మారాయని, లంచాలు ఇవ్వకుంటే పనులు జరగడం లేదని, ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు అనిల్‌కుమార్ దృష్టికి తెచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, అవినీతిపై పోరాటం చేయాలని ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. అధికారుల పనితీరులో మార్పు రాకుంటే, ఏకపక్షంగా పనిచేస్తుంటే కోర్టులకెళ్లడం, లోకాయుక్త, అవినీతి నిరోధక విభాగం అధికారులకు ఫిర్యాదులు చేద్దామన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, మాజీ ఎంపీపీ కొంతి వెంకటేశ్వరావు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, నాయకులు గొర్కెపూడి బుజ్జి, చింతలపూడి గవాస్కర్‌రాజు, ముళ్లపూడి నాగార్జున, పోరంకి రాము, కూరపాటి రాణి, పోరంకి బాబి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వస్త్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన పార్క్ స్థలదాత మాకర్ల వెంకట స్వామి నాయుడు 76వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆది వెలమ సంఘం, పార్క్‌లోని వెంకటస్వామి నాయుడు విగ్రహ కమిటీ ప్రతినిధి పిల్లారిశెట్టి శ్రీనివాసరావు, సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్క్‌లో పనిచేస్తున్న కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకటస్వామి నాయుడు ఎంతో ఉదార స్వభావంతో దానధర్మాలు చేసి ఎంతో మందిని ఆదుకోవటం ఆదర్శనీయమన్నారు. నాడు ప్రజావసరాల కోసం ప్రధాన రోడ్డులో కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని ఇవ్వగా నేడు ప్రధాన పార్కుగా నగర ప్రజలు కుటుంబ సమేతంగా సేదదీరేందుకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. పార్కు సూపరింటెండెంట్ రంగబాబు, పిల్లారిశెట్టి సత్యనారాయణ, మాదిరెడ్డి అంజిబాబు, పరిమి పాండురంగ అప్పలస్వామి, మరకాని వాసు, మాదిరెడ్డి ఆంజనేయులు, మాదిరెడ్డి ఈశ్వర్, ఐనాల నాగ రమేష్, మాదిరెడ్డి కుసుమహర్నాథ్ తదితరులు పాల్గొన్నారు. మాకర్ల వెంకట స్వామినాయుడుకు జోహార్లు అర్పించారు.



కంటి ఆపరేషన్లకు 33 మంది ఎంపిక



చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 33 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి వైద్యుడు బి.మోహనరావు శిబిరంలో మొత్తం 75 మందికి పరీక్షలు నిర్వహించారు. శిబిరం అనంతరం సీఎంఏ, నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వేముల హేమంత్, వరదా రేష్మంత్‌లను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు, హేమంత్ తల్లిదండ్రులు, వేముల పాండురంగారావు, దీపిక, రేష్మంత్ తల్లిదండ్రులు వరదా హరిగోపాల్, నాగమణి పాల్గొన్నారు.

స్వామివారికి వాటర్ కూలర్, వెండి వస్తువుల సమర్పణ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానానికి పలువురు భక్తులు ఆదివారం వాటర్ కూలర్, వెండి వస్తువులు సమర్పించారు. సూర్యాపేట వాస్తవ్యులు దారం శిరీష రూ.50 వేల విలువ గల వాటర్ కూలర్, రాగి జగ్గులను బహూకరించారు. విజయవాడ వాస్తవ్యులు రావి సుబ్బరత్నం స్వామివారికి సుమారు రూ.30 వేలు విలువైన 250 గ్రాముల వెండి నాగ పడగ, వెండి పళ్లెం స్వామివారికి కానుకగా అందజేశారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం అధికారులకు దాతలు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

దారి మళ్లుతున్న గ్యాస్ సిలిండర్లు

- వ్యాపార అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం
- హోటళ్లు, స్వీట్స్ షాపుల్లో యథేచ్ఛగా వాడకం
- పట్టించుకోని అధికారులు



పామర్రులోని ఓ హోటల్‌లో డొమెస్టిక్ సిలిండర్‌ను వినియోగిస్తున్న దృశ్యం

పామర్రు: సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు దారి మళ్లుతున్నాయి. గృహావసరాలకు మాత్రమే వినియోగించాల్సిన డొమెస్టిక్ సిలిండర్లు వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా పెద్ద పెద్ద హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల్లో వంట అవసరాల కోసం డొమెస్టిక్ సిలిండర్లనే వినియోగిస్తున్నా అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది.

సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో గ్యాస్ వినియోగం తక్కువగా ఉండటాన్ని వ్యాపారులు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. గతంలో డ్వాక్రా గ్రూపులకు ప్రభుత్వం పంపిణీ చేసిన దీపం కనెక్షన్లు చేతులు మారాయి. డొమెస్టిక్ లబ్ధిదారులకు అవసరం లేకున్నా వ్యాపారులు వారికి డబ్బులు ఇచ్చి అదనపు సిలిండర్లను బుక్ చేస్తున్నారు. ఈ విధంగా ఒక్కొక్క డొమెస్టిక్ సిలిండర్‌కు సుమారు రూ.1400పైనే వ్యాపారులు ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో నియోజవర్గంలోని పామర్రు, తోట్లవల్లూరు, మొవ్వ, పమిడిముక్కల, పెదపారుపూడి మండలాల్లో అధిక శాతం మంది పెద్ద హోటళ్లు , ఇతర వ్యాపారులు యథేచ్ఛగా వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నారు.

అధికారులకు ముడుపులు..

గ్యాస్ కంపెనీలకు చెందిన కొందరు ఇందుకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 14.2 కిలోల డొమెస్టిక్(గృహ అవసరాలకు) సిలిండర్ రూ.877లకు అమ్ముతున్నారు. ఈ మేరకు గృహ అవసరాలకు ఇచ్చే గ్యాస్ కిలో సుమారు రూ.61.7 వరకు ఉంది. వాణిజ్య అవసరాలకు సంబంధించిన కమర్షియల్ సిలిండర్లకు ఈ రాయితీ వర్తించదు. 19 కేజీల కమర్షియల్ సిలిండరు ధర సుమారు రూ.1,901లు వరకు ఉంది. ఈ మేరకు కిలో రూ.100 ల వరకు ఉంది పూర్తి మొత్తాన్ని చెల్లించి వ్యాపారులు సిలిండర్లు తీసుకోవాలి. వ్యాపార సంబంధిత అవసరాల కోసం కమర్షియల్ సిలిండర్లనే వాడాలి. డొమెస్టిక్ సిలెండర్ల సబ్సిడీపై తక్కువ ధరకు లభిస్తుండటంతో పలు పెద్ద హోటళ్ల, స్వీట్స్ షాపులు, బేకరీల్లో, రోడ్డు పక్కనే ఉండే చిన్న హోటళ్లలో సైతం డొమెస్టిక్ సిలిండర్లను యథేచ్ఛగా వినియోగిస్తూ వ్యాపారాలను సాగిస్తున్నారు. సబ్సిడీ రూపంలో ప్రభుత్వానికి ఆర్థికంగా ఎంతో నష్టం వాటిల్లుతున్నా పౌరసరఫరాల అధికారులు నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పెద్ద పెద్ద హోటళ్ల వారు అధికారులకు ముడుపులు ముట్టజెబుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం ద్వారా గృహ అవసరాల సిలిండర్లు దారి మళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

వ్యాపార అవసరాలకు డొమెస్టిక్ సిలెండర్ల వినియోగం నేరం. వ్యాపారాలకు కమర్షియల్ సిలెండర్‌లను మాత్రమే వినియోగించాలి. దీనికి విరుద్ధంగా ఎవరైనా వినియోగిస్తే వారిపై తగు విధమైన చర్యలు తీసుకుంటాం.

– జి.రవికాంత్, పామర్రు, తహసీల్దార్

సొంత ఊరికి గుర్తింపు తేవడం అభినందనీయం



హేమంత్‌తో పాటు తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ సభ్యులు

చల్లపల్లి: ఒక వ్యక్తి విజయం సాధించినప్పుడు అతనితో పాటు అతని తల్లిదండ్రులకు, సొంత ఊరికి కూడా గుర్తింపు లభిస్తుందని, అలాంటి గుర్తింపును తీసుకువచ్చిన వేముల హేమంత్ అభినందనీయుడని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. వేముల హేమంత్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటింట్స్(సీఎంఏ)లో జాతీయ స్థాయిలో 36వ ర్యాంకు సాధించి దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రశంసాపత్రం, పతకం సాధించిన విషయం తెలిసిందే. కానీ దీనిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎన్టీఆర్ పార్కులో ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత బోలెం రామారావు ఆధ్వర్యంలో హేమంత్, అతని తల్లిదండ్రులు పాండు రంగారావు, దీపికలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఈవోపీఆర్డీ దాసి సీతారామరాజు, నూకల లక్ష్మయ్య, రావెళ్ళ ఉదయ్‌కుమార్, ఆర్ఎంపీ వైద్యుడు పేర్ని మధుసూదనరావు, కైతేపల్లి దాస్, బుల్లా కిషోర్, ఉప్పల సాంబశివరావు, అంబటి శంకరరావు, కోడూరు వెంకటేశ్వరరావు, ముమ్మనేని సన్ని, షణ్ముఖ శ్రీనివాస్ తదితరులు వేముల హేమంత్, అతని తల్లిదండ్రులను అభినందించారు.

మానవత సేవ సంస్థ అధ్యక్షునిగా త్రివిక్రమరావు



పామర్రులో మాట్లాడుతున్న వంగర కిశోర్‌బాబు తదితరులు

పామర్రు: మానవత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షునిగా నూతలపాటి త్రివిక్రమరావును, నూతన కార్యవర్గం ఏర్పాటు చేశామని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ వంగర కిశోర్‌బాబు తెలిపారు. స్థానిక శివరామ కాంప్లెక్స్‌లోని ఎన్టీఆర్ ఫ్యాషన్ స్టూడియోలో మానవత పామర్రు శాఖ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు శాఖకు హైదరాబాద్ నుంచి కూడా సభ్యులను చేర్చుటకు, తెలంగాణ రాష్ట్రంలో కూడా మానవత శాఖలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక అంకమ్మతల్లి దేవాలయం ప్రాంగణంలో వచ్చే వారంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకరం చేస్తోందన్నారు. మానవత సేవలను మరింతగా విస్తృత పర్చేలా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక వాసు స్వీట్స్ అధినేత నూకల రమేష్ వితరణతో ఉన్న ఫ్రీజర్ బాక్స్‌ను రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ద్వారా త్వరలో అందిస్తారన్నారు. సభ్యత్వాల వసూలు, నూతన సభ్యులను చేర్చుటకు నిర్ణయించామని చెప్పారు. సమావేశంలో సభ్యులు శీతాల ప్రసాద్, ఎన్టీఆర్, మట్టా వీరాస్వామి, మండపాక సుబ్బారావు, బొండు సుధాకర్, కొల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పణ



గంగాభవానీ అమ్మవారికి ఆషాఢ సారెను తీసుకువస్తున్న భక్తులు



పైడమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించిన భక్తులు

కోడూరు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కోడూరు గంగాభవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు సంప్రదాయబద్ధంగా ఆషాఢ సారెను సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. యర్రారెడ్డివారిపాలెం గ్రామస్తులు స్థానిక రామాలయం వద్ద నుంచి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ సారెను భక్తులు ఆలయం చుట్టూ ఊరేగించారు. చీరలు, గాజులు, పసుపు, కుంకుమ, వివిధ పండ్లతో పాటు నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఆషాఢ సారె విశిష్టతను వివరించారు. గ్రామానికి చెందిన మహిళలు రహదారి పొడవునా కోలాట భజనలు చేస్తూ ఆకట్టుకున్నారు. అమ్మవారికి సంబంధించిన పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. గ్రామ ప్రముఖులు, ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ఆషాఢం సారెను సమర్పించారు. పట్టణంలోని 15వ వార్డులో వినాయకుని ఆలయానికి చెందిన భక్తులు ఆషాఢ మాసం మొదటి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుర వీధులలో ఊరేగింపుగా అమ్మవారి సారెను ఊరేగిస్తూ మేళతాళాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ గురు పూజోత్సవం

బంటుమిల్లి: దేశాన్ని సనాతన ధర్మ రక్షణ ద్వారా పరమవైభవ స్థితికి తీసుకువెళ్లడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని విజయవాడ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ పెదపాటి రవిబాబు అన్నారు. స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆషాఢ గురుపూర్ణిమను వ్యాస పూర్ణిమగా, గురు పూర్ణిమగా పిలుస్తారని, సంఘం ఈ కార్యక్రమాలను జులై 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న క్రమంలో విజయదశమి నుంచి నిర్వహించే ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాల విజయవంతానికి భాగస్వాములు కావాలని ఆయన చెప్పారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న స్వయం సేవకులు గురుదక్షిణ సమర్పణ చేశారు.